



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com


సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ VIJAYAWADA | సంపుటి : 25 | సంచిక : 69 | ది. 14-6-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| | Vol.No : 25 | Issue No : 69 | Date : 14-6-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# భారత్ అరుదైన ఘనత..

- ఐసీబీఎం స్థాయి ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం
- వరుసగా మూడు బి.ఎం.డి. ఫ్లైట్ టెస్టులు సక్సెస్

**న్యూఢిల్లీ ,జూన్ 13 (వార్తాప్రభ) :** రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

# వర్షపు నీటిని వడిసిపట్టేలా నీటి వనరులను సిద్ధం చేయాలి

- కాల్వలు, కరకట్టలు పటిష్టపరచాలి... నీటి ప్రవాహాలకు ఆటంకం లేకుండా చూడాలి
- జలధార-జలహారతి పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రస్తుతం జరుగుతోన్న జలధార-జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ-అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార-జలహారతి పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను కనెక్ట్ చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార కార్యక్రమంలో స్థానికులు, రైతులు, నీటి సంఘాలను భాగస్వాములు చేయాలని... దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

- రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం
- ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు
- 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'లో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్ 13 (వార్తాప్రభ) :** హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్ ను ప్రపంచపటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో... క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు... హైదరాబాద్ ను ఒక ల్యాంచ్ ప్యాడ్ తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా... కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్ కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్ లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్ కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్ ను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

# ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్..

- ఆర్జీయూకేటీ ఆరేళ్ల బీటెక్ కోర్సు ప్రవేశాల ఫలితాలు విడుదల
- ఎంపికైన విద్యార్థులు rgukt.in వెబ్‌సైట్ నుంచి లేఖలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు



**అమరావతి,జూన్ 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. 2026--27 విద్యా సంవత్సరానికి గానూ ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాల కోసం ప్రొవిజనల్ సెలెక్షన్ జాబితాను ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం విశేషం. ఈ ఏడాది మొత్తం 44,104 దరఖాస్తులు రాగా, వారిలో 4,040 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేసినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ఈ ప్రవేశాలు కల్పించనున్నారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఉండటం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూ గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించాలన్న ఆర్జీయూకేటీ లక్ష్యం మరోసారి నెరవేరిందని లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అభ్యర్థులు తమ ఎంపిక పత్రాలను అధికారిక వెబ్‌సైట్ తీస్త్రబన్.ఆఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే, సహాయం కోసం 9552300009 అనే వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్‌ను సంప్రదించవచ్చని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.


## వేలం ప్రకటన

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

E.P.No.1/ 2024
in
O.S.No.152 / 2022

BETWEEN :-
ఆవుల సీతారామయ్య ------D. Hr
మరియు
నరహరిశెట్టి సతీష్ ------J. Dr

పై నెంబరు వారెంటు బాకీవసూలు నిమిత్తం యీదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట ది. 29.06.2026న ఉదయం గం. 10.30ని. ల నుండి వేలం వేయబడును. సదరు పాడుకొనదలచిన వారు వేలం పాటలో పాల్గొని యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పాడు కొనవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయటమైనది.

**షెడ్యూలు :**
కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం మునిసిపల్ ఏరియాలోని 20వ వార్డులో J.Dr యొక్క సంపూర్ణ స్వాధీనహక్కు భుక్తములలో కలిగియుండి పై నెంబరు దావా బాకీకి హామీగా జప్తు కాబడి ఈనెంబరు డిక్రీబాకీ క్రింద వేలం కావలసిన స్థిరాస్తి వివరము : 20వ వార్డులో 281.25 చ. గ. ల స్థలము సదరు స్థలములో డోర్ నెం. 20/307-2 & డోర్ నెం. 20/307-2A ర్ను నిర్మిచబడిన Ground floor of Madras Terraced Building and R.C.C. Building in 1st floor కి హద్దులు :


**East :** Property Of Naraharisetty Ram Mohana Rao and Seelam jaya Venkata Chandra Maruthi Rao etc.
**South :** Property of Nararisetty Basavaiah
**West :** Property of Chalamalasetty Nageswara Rao
**North :** Municipal Road

D.Hr కిమ్మత్తు: రూ. 15,00,000/-
అమీనా కిమ్మత్తు :రూ . 80,00,000/-
మార్కెట్ విలువ : రూ. 59,97,780/-
NOTE:- E.C. దాఖలా అన్యాక్రాంతములు ఏమియున్నూ లేవు.
**(శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం)**

**పేర్ని సురేష్ బాబు**
**D. Hr తరుపున న్యాయవాది**
**మచిలీపట్నం**


# రేపు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

**అమరావతి,జూన్ 13 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూ-ర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్ తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు.



# అవును.. నాకు అహంకారమే: కెటిఆర్



**సిరిసిల్ల ,జూన్ 13 (వార్తాప్రభ) :** కొందరు కేటీఆర్‌కు అహంకారం ఉందంటారు. నిజమే, ఐదు పర్యాయాలు సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్నికల్లో ఒక్క రూపాయి, చుక్కా మందు పంచకుండా గెలిచాననే అహంకారం తనకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం పునరుద్ఘాటి ంచారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడారు. 2009 నుంచి సిరిసిల్ల నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు నిర్వహించేందుకు అసెంబ్లీ మెట్లు ఎక్కేందుకు సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలే కారణమని వారందరికి పాదాభివందనాలన్నారు. తనకు జన్మనిచ్చింది తల్లి శోభమ్మైతే, రాజకీయగా జన్మనిచ్చింది సిరిసిల్ల ప్రజలని, తన బొందిలో ప్రాణం ఉన్నంతవరకు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధి కోసం ఏదోరకంగా పనిచేస్తూనే ఉంటానని కేటీఆర్ ప్రకటించారు. వేలమంది బలిదానాలు చేసి సాధించుకున్న తెలంగాణ పుష్కరకాలం తర్వాత ముష్కరుల పాలైందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని ఎన్టీఆర్, ఇందిరాగాంధీ లాంటి మహా నాయకులే ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని, కాకపోతే పోరాడి సాధించి తెచ్చుకున్న తెలంగాణలో జరుగుతున్న దారుణాలు చూసి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ గుండె తల్లడిల్లుతోందన్నారు. సీఎం పదవి కోసం కేసీఆర్ ఆరాట పడటంలేదని అన్నిరంగాల ప్రజలకు ప్రస్తుతం జరుగుతున్న అన్యాయాలు చూసి కేసీఆర్ తల్లడిల్లుతున్నారన్నారు. సిరిసిల్లలో ఒకప్పుడు నక్సల్ సమస్యలు, నీటి సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు, సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు, ఉపాధి సమస్యలు ఇలా అనేక సమస్యలుండగా సాధించుకున్న తెలంగాణలో వాటిని పరిష్కరించుకుంటూ ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. నేతన్నల బతుకులు బాగుపడాలని, సిరిసిల్లలో నేతన్నల బతుకులు బాగుచేయాలని బతుకమ్మ చీరెలు తయారీ ఆర్డర్లు ఇస్తే వాటిలో కుంభకోణాలు, దోపిడీ అంటూ వాటిని రద్దు చేశారన్నారు. సిరిసిల్లలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ లేదని కేవలం విద్యుత్ ఆధారిత కుటీర పరిశ్రమ అని తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని నేతన్నలు, రైతన్నలు అన్నిరంగాల ప్రజలు కోరుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వచ్చినా రైతుల నుంచి ధాన్యం కళ్లకద్దుకొని కొనుగోలు చేశారని, రేవంత్ పాలనలో రైతుబంధు మాట దేవుడెరుగు కాళ్లుమొక్కినా రైతుల నుంచి కనీసం ధాన్యం కొనడం లేదన్నారు. కల్లాల వద్దే రైతులు వడదెబ్బతో ప్రాణాలు వదులుతున్నారన్నారు. రైతులకు గన్నీ బ్యాగుల కరువు ఎందుకైందని పరిశీస్తే గన్నీ బ్యాగుల మూటలు రాహుల్‌గాంధీకి చేరుతున్నాయన్నారు. రైతులకు మళ్లీ వెనుకటి రోజుల వచ్చాయని యూరియా దొరకడం లేదన్నారు. చెప్పులు వరసల్లో పెట్టి నిలబడాల్సి వస్తోందన్నారు. గతంలో సిరిసిల్ల నియోజకవర్గం వెంకటాపూర్‌లో యూరియా కోసం వచ్చిన రైతు మునిగె ఎల్లయ్య వడదెబ్బతో మృతిచెందిన సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. సన్నాసి సీఎం రేవంత్ వంద రోజుల్లో ఆరు హామీలు అమలుచేస్తానని 900 రోజులు గడిచినా అమలుచేయడం లేదన్నారు. పరిపాలన చేతకాని రేవంత్ నాపై 45 కేసులు పెట్టాడన్నారు. కేసులకు వెరవనన్నారు. వచ్చే ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో కేసీఆర్‌నే అభ్యర్థిగా భావించి అందరినీ ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను తెచ్చే ఎన్నికలు కావాలన్నారు. ఉపన్యాసాలతో ఓట్లు పడవని, ప్రతీ నాయకుడు తన పరిధిలోని బూత్‌లో మెజార్టీ ఓట్లు సాధించాలన్నారు. ఈ సంవత్సరంలో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వాలు సేకరించి, కమిటీలు వేసి, కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించి సుశిక్షితులైన సైనికుల్లా తయారుచేస్తామన్నారు. రేవంత్ పాలనా తీరును సినిమా టీజర్, ట్రైలర్‌లా చూసి ప్రజలు హిట్టా ఫట్టా అనేది తేల్చేశారన్నారు. కాంగ్రెస్ సినిమా డిజాస్టర్ అన్నారు.


## CHANGE OF NAME

I, **PEDISETTI MEHAR KUMAR** (Old Name), S/o. **SRINIVASA RAO**, resident of D.No: 24/408, Buttaipeta, Machilipatnam, Krishna District. I have changed my name from **PEDISETTI MEHAR KUMAR** (Old Name) to **PEDDISETTY MEHAR KUMAR** (New Name). Hereafter my name is known as **PEDDISETTY MEHAR KUMAR** (New Name) for all purposes.

# నేడు ఘంటసాల వారి పాటల పోటీలు..

**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 13 (వార్తాప్రభ) :** ఘంటసాల వంశ జన్మశాలైన ఘంటసాల గ్రామంలో మధుర గాయకుడు ఘంటసాల వారి 'స్వర సుమాంజలి గాన పోటీలను' ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఘంటసాల కళా సమితి అధ్యక్ష కార్యదర్శులు ఘంటసాల కృష్ణమోహన్, పోతన వెంకటేశ్వరరావు లు తెలిపారు .మధ్యాహ్నం రెండు గంటల నుండి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో గాయక సార్వభౌమ ఘంటసాల వారు పాడిన పాటలను ట్రాక్ లేకుండా పాడాలని వారు చెప్పారు.ఈ పోటీలకు ముందుగా పామర్రుకు చెందిన చిన్నారులు కోలవెన్ను ప్రణీత, ఉల్లి రోషిత, శ్రీవల్లికలచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన అనంతరం కొందరు ట్రాక్ పైన గాయక ఘంటసాల వారి పాటలు పాడి కచేరి నిర్వహిస్తారని చెప్పారు. ఆ నంతరం జరుగు పాటల పోటీలో పాల్గొనదలిచినవారు ట్రాక్ లేకుండా పాటలు పాడాలన్నారు. ఇప్పటికే పలు జిల్లాల నుండి గాయకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ఘంటసాలలో గాయక ఘంటసాలవారి గాన కచేరి జరిగి 60 సంవత్సరాలు అయిన సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలో ఇంకా ఎవరైనా గాయకులు పాల్గొన దలిస్తే సరాసరి కృష్ణా జిల్లా ఘంటసాలలోని శ్రీ జలధీశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోనికి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలలోపు వచ్చి తమ పేర్లను నమోదు చేయించుకోవచ్చని వారు వివరించారు.

# కాలువల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న డీసీ చైర్మన్ బొర్రా కాశి





**కృత్తివెన్ను,జూన్ 13 (వార్తాప్రభ) :** బంటుమిల్లి డీసీ పరిధిలోని పంట కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి రైతుల ప్రశంసలు అందుకుంటున్నారు డీసీ చైర్మన్ బొర్రా కాశీ. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు చేరేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. కాలువల్లో కలుపు మొక్కలు, గుర్రపుడెక్క, తూడు విస్తరించకుండా కలుపు మందును పిచికారీ చేయిస్తూ నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగిస్తు న్నారు. పంట కాలువలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుతుందనే లక్ష్యంతో బొర్రా కాశీ అహర్నిశలు కృషి చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.రైతుల సమస్యలను గుర్తించి వెంటనే స్పందిస్తూ సాగునీటి వ్యవస్థను మెరుగుపర్చడంలో విశేష కృషి చేస్తున్న డీసీ చైర్మన్ బొర్రా కాశీకి పలువురు రైతులు అభినందనలు తెలియజేస్తున్నారు. స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు రైతుల సేవలో బొర్రాకాశి ముందుకు దూసుకుపోతున్నారు

# చెట్టు పై నుండి పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి



**నూజివీడు,జూన్ 13 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన మొగధాటి సందీప్ (26) మామిడి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు పడిపోయి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మామిడి కోతకు వెళ్లిన సందీప్ గత నెల 20వ తేదీన ప్రమాదవశాత్తు పడిపోవడం జరిగింది. ఈ ప్రమాదంలో సందీప్ కు మెడ, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. నూజివీడులో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు విజయవాడ నగరంలోని సన్ రైస్ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. సందీప్ కుటుంబ సభ్యుల వద్ద మరిన్ని వైద్య సేవలు పొందేందుకు డబ్బు లేకపోవడం వలన ఈనెల 12వ విజయవాడ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయవాడలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని సతీమణి ఆరు నెలల గర్భవతి. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏడాది క్రితం వివాహం జరగడం, సందీప్ సతీమణి ఆరు నెలల గర్భవతి కావడం మరింత విషాదాన్ని మిగిల్చిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# వాహన చోదకులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలి

- చల్లపల్లి ఎస్ ఐ దుర్గా వీరాంజనేయులు.



**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 13 (వార్తాప్రభ) :** వాహన చోదకులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని చల్లపల్లి ఎస్ఐ డి.దుర్గావీరాంజనేయులు సూచించారు.శనివారం స్థానిక ప్రధాన సెంటర్ నుండి లక్ష్మీపురం వరకు భద్రతపై ద్విచక్ర వాహనాలతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెలెట్ ధరించక పోవడం వలనే రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం నష్టపోతున్నారన్నారు. వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించడంతో పాటు, సరైన భద్రతా ప్రమాణాలు విధిగా పాటిస్తే అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నష్ట తీవ్రతను తగ్గించవచ్చునన్నారు. వాహన చోదకులు తమ వ్యక్తిగత భద్రతతో పాటు ఎదుటి వారి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని కోరారు.హెల్మెట్ ఆవశ్యకత, రహదారి బద్రత అంశాలపై పలు జనసమ్మర్ధ ప్రదేశాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ సిబ్బంది తో పాటు వివిధ రంగాల ప్రతినిధులు హెల్మెట్ ధరించి అవగాహనా ర్యాలీ లో పాల్గొన్నారు.

# వెంకటరత్నం లేని లోటు తీర్చలేనిది : యార్లగడ్డ

## -మూల్పూరి కుమారుడ్ని ఫోన్లో పరామర్శించిన యార్లగడ్డ





**హనుమాన్ జంక్షన్, జూన్ 13 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు మూల్పూరి వెంకటరత్నం ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విచారం వ్యక్తం చేశారు. ఆరుగొలను గ్రామ మాజీ మునసబ్, టిడిపి నాయకులు మూల్పూరి వెంకటరత్నం శనివారం కన్నుమూశారు. వెంకటరత్నం మరణవార్త తెలిసిన వెంటనే అమెరికాలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు ఫోన్ చేసి వెంకటరత్నం కుమారుడు ప్రసాద్ ను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించిన వెంకటరత్నం ఆకస్మిక మరణం బాధాకరమన్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షులుగాను, బాపులపాడు మండల పార్టీ అధ్యక్షులుగాను, అడ్ హాక్ కమిటీ సభ్యులుగాను విభిన్న హోదాల్లో పనిచేసిన ఆయన కడవరకు పార్టీ కోసం అంకితభావంతో, నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. మునసబ్లుగా పనిచేసిన వారిలో ఆఖరి తరం ఈయనే అయివుండొచ్చని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తన విజయం కోసం గట్టిగా కృషి చేసారని గుర్తుచేసుకున్నారు. ఇటీవల 90 వ పుట్టినరోజు వేడుక జరుపుకున్న వెంకటరత్నంను అదే వేడుకలో చివరిసారిగా కలిసానని అన్నారు. తాను అమెరికా వెళ్లేముందు వెంకటరత్నాన్ని చూడాలనిపించి ఫోన్ చేయగా హైదరాబాద్లో ఉన్నట్లు చెప్పారని అమెరికా నుండి వచ్చిన తరువాత చూసివద్దామనుకునేలోపు దేవుని వద్దకు వెళ్లిపోయారని పేర్కొన్న ఎమ్మెల్యే వెంకట్రావ్ ఫోన్లో మూల్పూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

- బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావడంపై హర్షం



**అమలాపురం,జూన్ 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ సమాజ సంక్షేమం, అర్చకుల అభ్యున్నతి, దేవాలయ వ్యవస్థ పరిరక్షణకు దోహదపడే కీలక నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తీసుకుందని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ వెంకట నారాయణమూర్తి పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఇప్పటి వరకు ఉన్న ఈడబ్ల్యూఎస్ ( ఈడబ్ల్యూఎస్ ) శాఖ పరిధి నుండి దేవాదాయ ధర్మాదాయ (ఎండోమెంట్స్) శాఖ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనా పరమైన మార్పు మాత్రమే కాదని, బ్రాహ్మణుల సంక్షేమం పట్ల కూటమి ప్రభు త్వానికి ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధత, బాధ్యతాయుత వైఖరికి నిదర్శనమని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బ్రాహ్మణ సమాజం ఎదురుచూస్తున్న ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయ మని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి తీసుకురావడం ద్వారా బ్రాహ్మణుల సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అర్చకుల జీవనోపాధి, వేద పండితుల సంక్షేమం, ఆలయ సేవకుల అభివృద్ధి, ధార్మిక సంప్రదాయాల పరిరక్షణ వంటి అంశాలకు ఈ నిర్ణయం కొత్త ఊతాన్ని అందిస్తుందని తెలిపారు. దేవాలయ వ్యవస్థతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పనిచేయడం వల్ల ధార్మిక కార్యక్రమాలు, వేద విద్యాభివృద్ధి, అర్చకుల శిక్షణ, సంక్షేమ పథకాల అమలు మరింత వేగవంతమవుతాయని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు, వేద పాఠశాలలకు,ధార్మిక సంస్థలకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.బ్రాహ్మణుల సంక్షేమం,అర్చకుల అభ్యున్నతి,దేవాలయ వ్యవస్థ బలోపేతం, భారతీయ సనాతన ధార్మిక విలువల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి స్పష్టం చేసిందని ఆకెళ్ళ వెంకట నారాయణమూర్తి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి అవసరమైన మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఈడబ్ల్యూఎస్ శాఖ నుండి ఎండోమెంట్స్ శాఖకు మార్చే నిర్ణయం తీసుకోవడంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ , బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ , దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి లకు, అలాగే కూటమి ప్రభుత్వ నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సమాజ అభ్యున్నతి, అర్చకుల సంక్షేమం, ధార్మిక వ్యవస్థ అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని ఆకెళ్ళ వెంకటనారాయణమూర్తి పేర్కొన్నారు.

# అజాతశత్రువు మూల్పూరి వెంకటరత్నం కన్నుమూత





**హనుమాన్ జంక్షన్,జూన్ 13 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మూల్పూరి వెంకటరత్నం మునసబు (90) శనివారం ఉదయం విజయవాడ ఆయుష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో సేవలందించిన వెంకటరత్నం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు అత్యంత సన్నిహితులు. బాపులపాడు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులుగా , రైతు కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా అలాగే పార్టీలోని వివిధ హోదాల్లో పలు పదవులు అలంకరించి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. అమరావతి ఉద్యమంలో పాల్గొని లక్ష రూపాయల విరాళం అందించారు. వీరికి ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు వున్నారు. ఆదివారం ఉదయం ఆరుగొలను గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మూల్పూరి భౌతికాయాన్ని బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, టిడిపి కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, పుట్టా సురేష్, అక్కినేని కృష్ణాజి, లంక అజయ్, గుండపనేని సుబ్బారావు, మూల్పూరి పూర్ణచంద్రరావు, తదితరులు సందర్శించి తెలుగుదేశం జెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు మూల్పూరి ప్రసాదు కు ఇతర కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మనబడి- మన పండుగ..



**నూజివీడు,జూన్ 13 (వార్తాప్రభ) :** జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరం లో మనబడి -మన పండుగ కార్యక్రమము నిర్వహించడ మైనదని పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయ కుమారి తెలిపారు. ఈ నూతన విద్యా సంవత్సరములో అధికారులు ఆదేశాల మేరకు మొదటిరోజు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు, తల్లి దండ్రులు, గ్రామస్తుల భాగస్వా మ్యంతో పండుగ వాతావరణములో పాఠశాల సిద్ధం చేయటం,తరగతుల పరిశుభ్రము చేయటం, విద్యార్థిని విద్యార్థుల తో ముగ్గులు వేయంచడం, వెల్ కమ్ బోర్డు గీయించడం, మామిడితోరణాలతో పాఠశాల అలంకరించడం, అరిటి బోదెలతో స్టేజీ అలంకరణ చేయించడం జరిగినది అని తెలిపారు.

**విద్యార్థినీ విద్యార్థులకు ఘన స్వాగతం..** తల్లిదండ్రులు,విద్యార్థులను పూలతో, చప్పట్లతో ఆహ్వానించడం, వారికి చాక్లెట్లుఅందించడం. క్రొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం చెప్పటం జరిగినది అని తెలిపారు. తదనంతరం పాఠశాల అసెంబ్లీ నిర్వహించి ప్రతిజ్ఞ, ప్రధానోపాధ్యాయిని సందేశం, విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన, విద్యార్థుల ఆటలు, పాటలతో స్కూల్ వాతావరణము పండుగ సంతరించుకుంది.ప్రభుత్వ పథకాల వివరాలను తెలియ చేయడంజరిగినది. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనము అందించడముజరిగినది. పదవతరగతి ఫలితాల్లో పర్సం డేజ్ లో నూజివీడు మండలములోనే ప్రథమ స్థానము రావటానికి కృషి చేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయలను ప్రధానోపాధ్యాయిని అభినందించడము జరిగినది. పెద్దలు మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదలకు కంటి వెలుగులు అందించడం గొప్ప సేవ: కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషా

- డాక్టర్ మాధవ్, డాక్టర్ అపర్ణ ఆధ్వర్యంలో విజయవాడలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం
- శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్



**విజయవాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం గొప్ప మానవతా కార్యక్రమమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషా అన్నారు. విజయవాడలోని శంకర నేత్రాలయ కంటి వైద్యశాలలో నిర్వహించనున్న ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సల శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీషా మాట్లాడుతూ... ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ డాక్టర్ మాధవ్, డాక్టర్ అపర్ణ దంపతులు ,సృజన పాలూరి తమ మాతృభూమిని మరువకుండా ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. జన్మభూమిపై ఉన్న అభిమానంతో పేదలకు కంటి చూపు అందించేందుకు వారు చేస్తున్న సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. డాక్టర్ మాధవ్, డాక్టర్ అపర్ణ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ, మెసూ హైదరాబాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. జూన్ 15 నుంచి 21 వరకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి జూన్ 18 నుంచి 22 వరకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు, మందులు, కళ్లద్దాలు అందించడంతో పాటు అర్హులైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, సెక్రటరీ చిట్టిబాబు, సభ్యులు బలరాం ,రిలయన్స్ రమణారావు తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాలకు 9440029999, 9393097373 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# ట్రిపుల్ ఐటీలో సీటుకు అర్హత సాధించిన తోటమూల హై స్కూల్ విద్యార్థులు





**పెడన,జూన్ 13 (వార్తాప్రభ) :** ఈసంవత్సరం మార్చి 2026 పదవ తరగతి నందు ఉత్తీర్ణులైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోటమూల విద్యార్థినులు పరసా చాందిని మెండు రమ్యశ్రీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ప్రవేశానికి అర్హత సాధించారు.వీరు 590 మార్కులతో పాఠశాల లో ప్రథమ స్థానం పొందారు ప్రభుత్వ పాఠశాలల్లో పెడన మండలం పెడన నియోజకవర్గం స్థాయిలో ద్వితీయ స్థానం అలాగే 579 మార్కులతో పాఠశాల లో ద్వితీయ స్థానం ప్రభుత్వ పాఠశాలల్లో పెడన మండలం లో ద్వితీయ స్థానం సాధించిన మెండు రమ్యశ్రీ లకు శనివారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో ఇద్దరు నూజివీడు క్యాంపస్ లో సీటు సాధించారు. ఈ నెల 19 వ తేదీన వీరికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు సలోమి హరనాథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతల పాటి నాగేశ్వరరావు ఉపాధ్యాయులు వీరికి అభినందనలు తెలియజేశారు

# నరేష్ అకాల మరణం విచారకరం

## -మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు



**విస్సన్నపేట,జూన్ 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామానికి చెందిన వీరమాచినేని నరేష్ లా అండ్ ఆర్డర్ పరిధిలో శుక్రవారం కొట్టిన దెబ్బలకు శనివారం ఉదయం గుండెపోటుతో మరణించినట్టు మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన విషయాన్ని మీడియాకు తెలియజేశారు. ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ విస్సన్నపేట క్లస్టర్ ఇంచార్జ్ నెక్కలపు శ్రీనివాసరావు( దాబా శ్రీను ), తెల్లదేవరపల్లి సహకార సంఘ అధ్యక్షుడు వీరమాచినేని కృష్ణ ప్రసాద్, పద్మారావు, ధమాలపాటి సాంబశివరావు తదితరులు టిడిపి అభిమాని నరేష్ పార్థివ దేహానికి పూలదండలతో నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# అర్జా నగేష్ ను కలసిన మల్లేశ్వరం 'పాల'కవర్గం



**పెడన,జూన్ 13 (వార్తాప్రభ) :** మల్లేశ్వరం గ్రామానికి చెందిన పాల సహకార సంఘం నూతన పాలకవర్గం శనివారం నాడు కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా నగేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నగేష్ ను శాలువాతో సత్కరించారు.పెడన మండలం పెనుమల్లి గ్రామంలోని నగేష్ నివాసంలో కలసి ఎన్నిక జరిగిన విధానాన్ని వివరించారు. గొర్ల సుభాషిణి చంటి నూతన అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన సంగతి తెలిసిందే.ఈసందర్భంగా నగేష్ నూతన పాలకవర్గాన్ని అభినందించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన పాలకవర్గం కూడా సొసైటీ అభివృద్ధికి కృషి చేసిందని అదే బాటలో మీరు కూడా పనిచేయాలనినగేష్ అన్నారు అనంతరం గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ ని కూడా వీరు కలిశారు.

# రౌతులపూడి మండలం నుండి త్రిబుల్ ఐటీ కి నలుగురు విద్యార్థినిలు ఎంపిక

**రౌతులపూడి,జూన్ 13 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం లో టెన్త్ నుండి ఇంటర్ ఇప్పుడు త్రిబుల్ ఐటీ కి అమ్మాయిలే టాపర్స్ రౌతులపూడి మండలం లో నలుగురు విద్యార్థినిలు ఎంపికయ్యారు ఒకటి కొల్లు పుష్ప నవ్య జ్యోతి 579/600 బర్ల ఉమా సత్య శివాని 573 / 600 దార్లపూడి వర్ష 589 / 600 గోపల్లి ప్రవనిక 574 / 600 మీరు నలుగురు వివిధ ప్రాంతాల్లో చదువుకున్న రోజులు కూడా మండలం నుంచి త్రిబుల్ ఐటీ కి ఎంపికవడం వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు రోడ్డు విద్యాశాఖ తెలిపింది

## క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వారికి అవసరమైన ప్రోత్సాహం సహకారం అందించాలి...

● బిఆర్ఎస్ యువ నాయకుడు దిలీప్



**జవహర్ నగర్, జూన్ 13: (వార్తా ప్రభ)**క్రీడలు మానసిక శారీరక వికాసానికి హేతువులని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వారికి అవసరమైన ప్రోత్సాహం సహకారం అందించాలని బిఆర్ఎస్ యువనాయకుడు దిలీప్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శాంతినగర్ లో యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు శాంతినగర్ యువతకు వాలీబాల్ కిట్ ను శనివారం బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా యువ నాయకుడు దిలీప్ మాట్లాడుతూ యువత క్రీడల ద్వారా శారీరకంగా దృఢంగా మానసికంగా ఉత్సాహంగా ఎదగాలని ఆకాంక్షించారు. యువత మానసిక అభివృద్ధితోపాటు శారీరక అభివృద్ధికి మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని మనిషి సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరం అన్నారు. యువతను ప్రోత్సహించడానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు వారికి అవసరమైన ప్రోత్సాహం సహకారం అందించడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ హెచ్ నూతన రిజిస్టర్ గా డాక్టర్ ఏ.జయలక్ష్మి



**కూకట్ పల్లి,జూన్13(వార్తాప్రభ):** కూకట్పల్లి లోని జేఎన్టీయూ హెచ్ నూతన రిజిస్టర్ గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియమితులయ్యారు. యూసీఈఎస్‌టీహెచ్ లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం యొక్క ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా. ఎ. జయ లక్ష్మి, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌కు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గత 54 సంవత్సరాల జెఎన్టియు హెచ్ చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళ రిజిస్టర్ గా డాక్టర్ ఏ జయలక్ష్మి నియామకం కావడం విశేషం. గతంలో ఇదే జేఎన్టీయూ క్యాంపస్లో ఆమె ప్రిన్సిపాల్ గా తదనంతరం డైరెక్టర్ గా పనిచేసి విధులను సమర్థవంతంగా నిర్వహించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. కాగా యూసీఈఎస్‌టీహెచ్ లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ యొక్క నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వర రావు నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెఎన్టియు విద్యాపక బృందం, విద్యా ప్రముఖులు పలువురు డాక్టర్ జయలక్ష్మి కి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## సామాజిక భాగస్వామ్యంతో పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలన



**కూకట్ పల్లి,జూన్ 13(వార్తాప్రభ):**సైబరాబాద్ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు ప్రజల భాగస్వామ్యం, సమన్వయం మరియు పారిశుద్ధ్య సిబ్బంది కృషితో విజయవంతంగా నిర్మూలించబడ్డాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజల సహకారంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది మరియు రామ్‌కీ సంస్థ సిబ్బంది చురుకుగా పాల్గొని పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను లక్ష్యంగా తీసుకొని శుభ్రపరిచారు. అనంతరం ఆ ప్రదేశాలను పూలతో, రంగవల్లులతో అలంకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూకట్పల్లి డీసీ ఆంజనేయులు మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా, పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. సమాజం, పారిశుద్ధ్య సిబ్బంది మరియు స్థానిక సంస్థల సమిష్టి కృషితో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

# సిమ్స్ కాలేజీలో కలకలం!!

● డిన్నర్ వికటించి 8 మంది మెడికోలకు అస్వస్థత ● ప్రైవేట్ రెస్టారెంట్ ఫుడ్ పాయిజన్ ● కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతున్న స్టూడెంట్స్ ● ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ పర్యవేక్షణ లోపమేనా? ● చర్యలకు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్








**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)**భవిష్యత్తులో ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన కాబోయే డాక్టర్లు.. నేడు ప్రాణాంతకమైన నిర్లక్ష్యానికి బలై ఆసుపత్రి బెడ్‌పై కొట్టుమిట్టాడుతున్నారు. రామగుండం సిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మంది మెడికల్ విద్యార్థులు తీవ్ర వాంతులు, విరోచనాలతో రామగుండం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఆ రాత్రి (శుక్రవారం) ఏం జరిగింది?** లభించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి సిమ్స్ కాలేజీకి చెందిన 11 మంది విద్యార్థులు బయట ఉన్న 'డెస్టినేషన్ రెస్టారెంట్'కు డిన్నర్ కోసం వెళ్లారు. అక్కడ వారు తీసుకున్న ఆహారం పూర్తిగా వికటించింది. తిన్న కొద్దిసేపటికే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అర్ధరాత్రి వేళ ఒక్కొక్కరికీ విపరీతమైన వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి మొదలయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే వారిని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎనిమిది మంది మెడికోలు అక్కడే చికిత్స పొందుతుండగా, మిగతా వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

**కాలేజ్ ప్రిన్సిపాల్, వార్డెన్ నిద్రిస్తున్నారా?**

**ఘాటుగా ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు!!**

ఈ దారుణ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే మెడికల్ విద్యార్థులకు, రాత్రి పూట అంతమందికి బయట రెస్టారెంట్లకు వెళ్ళడానికి అనుమతులు ఎలా ఇస్తున్నారు? ఇది ముమ్మాటికీ కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ల పర్యవేక్షణ లోపమే!! విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసి, వారు ఎటు వెళ్తున్నారు, ఏం తింటున్నారు అనే కనీస పట్టింపు లేకుండా వ్యవహరించడం వల్లే ఈరోజు ఇంత పెద్ద ప్రమాదం జరిగింది.

**జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు?** తమ పిల్లలను డాక్టర్లను చేయాలని ఎన్నో ఆశలతో, నమ్మకంతో కాలేజ్ యాజమాన్యానికి అప్పగిస్తే, కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏంటని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**బాధ్యత ఎవరిది?** రేపు పొద్దున ఆసుపత్రిలో ఉన్న విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? కాలేజ్ ప్రిన్సిపాలా? హాస్టల్ వార్డెనా? లేక నాసిరకం ఆహారం పెట్టిన సదరు రెస్టారెంట్ యాజమాన్యమా?

**సమాధానం చెప్పేది ఎవరు?** తమ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే, కన్నవారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులకు లేదా?

**కఠిన చర్యలకు డిమాండ్**విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్న ఆ డెస్టినేషన్ రెస్టారెంట్‌పై తక్షణమే ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడి చేసి, సీజ్ చేయాలని.. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కాలేజ్ ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఘాటుగా డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# స్పందన కుటుంబానికి పెద్దపల్లి పెరిక సంఘం అండ!!

● అమెరికాలో గాయపడ్డ విద్యార్థినికి భారీ ఆర్థిక సాయం ● దాతలు కూడా ముందుకు వచ్చి సహాయం చేయాలని పిలుపు



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన లగిశెట్టి స్పందన, మే 31న చికాగోలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. మెట్రో స్టేషన్ పైభాగం నుంచి 25 అడుగుల ఎత్తు నుంచి కిందపడటంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. ఈ వార్త తెలిసి తల్లిదండ్రులు లగిశెట్టి శ్రీనివాస్, సునీత దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వారి ఆవేదనను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోతున్నారు. ఈ కష్టకాలంలో పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం మానవత్వంతో ముందుకు వచ్చింది. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, పెద్దపల్లి జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు దుండే మల్లేష్, రామగుండం కార్పొరేషన్ పెరిక సంఘం అధ్యక్షులు పోతరాజుల అంజయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారు తక్షణ సాయంగా రూ.1,51,216 ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. స్పందన త్వరగా కోలుకుని తిరిగి రావాలని ప్రార్థిస్తూ, దాతలు కూడా ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. కష్టాల్లో ఉన్నప్పుడు చేయూతనిచ్చే చేతులే నిజమైన బంధాలు అని పెరిక సంఘం ఈ సాయం ద్వారా నిరూపించింది. ఈ మానవీయ కార్యక్రమంలో మంచిర్యాల పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డు శంకరయ్య వార్డ్ కౌన్సిలర్ కుమార స్వామి పెరిక సంఘ నాయకులు బత్తుల రమేష్, అక్కల నారాయణ, ఉగ్గే కుమార్, రాజు ,తిప్పని రాయలింగు, కందుల శంకరయ్య, మార్త రాజేశం, కందుల సత్యనారాయణ, లగిశెట్టి చంద్రమౌళి,కందుల పోచం, ఆకుల సత్యనారాయణ, మీస వికాస్, కనకరాజు, బియ్యాల మహేందర్ పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్య అందించారు.

# రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ విస్తృత పర్యటన

● తాగునీరు, మురుగునీరు, చిరు వ్యాపారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం ● ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు: కేపీ వివేకానంద్ హెచ్చరిక





**జగద్గిరిగుట్ట, జూన్ 13, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట పరిధిలోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో నెలకొన్న వివిధ దీర్ఘకాలిక సమస్యలపై స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కేపీ. వివేకానంద్, పూర్వ నగర సేవకులు (మాజీ కార్పొరేటర్) కొలుకుల జగన్ శనివారం కాలనీలో విస్తృతంగా పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, స్థానిక బస్తీ నాయకులు మరియు ప్రజలతో కలిసి వారు సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా కాలనీవాసులు తమ ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, మురుగునీటి పారుదల (డ్రైనేజీ) వ్యవస్థ దారుణంగా మారి వీధుల్లో మురుగునీరు పొంగిపొర్లుతున్న వైనాన్ని వివరించారు. వీటితో పాటు జీవనోపాధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న చిన్నచిన్న అంగళ్ల (షాపుల) తొలగింపు నోటీసుల అంశాన్ని, కాలనీ సంక్షేమ సంఘ భవన నిర్మాణం మరియు అంతర్గత రహదారుల (రోడ్ల) దుస్థితిని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ప్రజల ఆవేదనను విన్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత మున్సిపల్, జలమండలి అధికారులను వెంటనే అక్కడికి పిలిపించి కాలనీ అంతటా కలిసి పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి, మురుగునీటి సమస్యలను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు. ప్రజల సంక్షేమం మరియు ఆరోగ్య విషయాలలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని హెచ్చరించారు. రాజీవ్ గృహకల్ప చిరు వ్యాపారుల సమస్యపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. కుటుంబ పోషణ కోసం చిన్న దుకాణాలు నడుపుకుంటున్న నిరుపేద వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉంటూనే, వారి నోటి కూడు దెబ్బతినకుండా, జీవనోపాధికి ఆటంకం కలగకుండా సముచితమైన పరిష్కారం చూపాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలపై స్పందించిన మున్సిపల్, జలమండలి అధికారులు మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటి కొరతను తీర్చడానికి, మురుగునీటి కాలువల మరమ్మతులకు తక్షణమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే చిరు వ్యాపారుల అంశాన్ని మానవతా దృక్పథంతో, సానుకూలంగా పరిశీలించి వారికి ఎలాంటి నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ పర్యటన కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## మారుపేర్ల బాధితుల గర్జన

● ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ భారీ ధర్నా ● పరిష్కారం దొరికే వరకు పోరాటం ఆగదు ● బిఆర్ఎస్ నాయకులు కౌశిక హరి



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)**ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట శనివారం బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, టీబీజీకేఎస్ నాయకుల ఆధ్వర్యంలో సింగరేణి మారుపేర్ల బాధితులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గళమెత్తారు. అనంతరం నాయకులు కౌశిక హరి మాట్లాడుతూ, సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న మారుపేర్ల విజిలెన్స్ సమస్యలను యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మారుపేర్ల కుటుంబాల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న అధికారుల వైఖరిని ఖండించారు. కార్మికులకు అత్యంత కీలకమైన మెడికల్ బోర్డును నిలిపివేయడం వల్ల అనేక మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వెంటనే మెడికల్ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే క్లియర్ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. మారుపేర్ల బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. కార్మికుల ఐక్యతే తమ బలమని, ఐక్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమం నినాదాలతో హోరెత్తగా, కార్మికులు తమ డిమాండ్లపై యాజమాన్యం వెంటనే స్పందించాలని కోరారు. చివరగా కార్మికుల న్యాయపోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.


## సీనియర్ నేషనల్స్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర సీనియర్ స్విమ్మింగ్ జట్టు

**జూన్ 16 నుంచి 21 వరకు గుజరాత్ వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో పోటీలు యూనిఫామ్ టీమ్ కిట్ ని అందించిన 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్**



**హైదరాబాద్ :జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర సీనియర్ స్విమ్మింగ్ జట్టు సీనియర్ నేషనల్స్ పోటీలకు సిద్ధమైంది. సీనియర్ నేషనల్స్ స్విమ్మింగ్ జట్టు ఎంపిక ట్రయల్స్ 2026 మే 24న అంబర్‌పేట్ లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన 11వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. తెలంగాణ స్విమ్మింగ్ టీం కెప్టెన్ సుహాస్ ప్రీతం మైలారి ని ఎంపిక చేశారు. రాష్ట్ర స్విమ్మింగ్ జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్ లకు శనివారం గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో యూనిఫామ్, టీషర్ట్స్ కిట్ అందించారు. ఈ ఈవెంట్ కిట్ ని 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ టీ , స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి . చంద్ర శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి జి . ఉమేష్ , 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ ఎండీ ఎల్. ఎం శంకర్ , టీం మేనేజర్ టి.కిరణ్ కుమార్, టీం స్విమ్మింగ్ కోచ్ ఆయుష్ యాదవ్ , విజయ్ సింగ్ పాల్గొన్నారు . తెలంగాణ స్విమ్మింగ్ టీం 2026 జూన్ 16 నుంచి జూన్ 21 వరకు అహ్మదాబాద్, గుజరాత్ లో ఉన్న అక్వాటిక్ కాంప్లెక్స్ , వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొంటారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఎల్బీనగర్/వార్త ప్రభ (జూన్ 13):** హైదరాబాద్లోని తన నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తలకొండపల్లి మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన గొరిగే వెంకటయ్యకు రూ.75 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మోడీ పచ్చ జెండా కోసం వెయిటింగ్ !

ఉత్తరాంధ్రాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అన్ని పనులూ పూర్తి చేసుకుని ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తోంది. మరి కొద్ది రోజులలో ఈ ఎయిర్ పోర్టు తన ఆపరేషన్స్ ని స్టార్ట్ చేయనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ ఎయిర్ పోర్టుని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో ప్రధానమంత్రి కార్యాలయం వైపు అంతా చూస్తున్నారు. జూలై 5 డేట్ మీదనే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఎందుకంటే జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి. ఈ ఇంటర్నేషనల్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టారు. దాంతో ఆయన స్ఫూర్తితో ప్రారంభించుకోబోయే ఈ పోర్టు ఒక రోజు అటు ఇటుగా ఆయన జయంతి వేళ శ్రీకారం చుట్టుకోవాలని ప్రభుత్వ వర్గాల అభిలాషగా ఉంది. దాంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూలై 5న ఎయిర్ పోర్టుని ప్రారంభించడానికి గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. జూలై 5 డేట్ ని ఫిక్స్ చేస్తే బాగుంటుంది అన్నదే అందరి అభిప్రాయంగా ఉంది. ఇదిలా ఉంటే భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవం కోసం జూలై 5 తేదీని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా చెబుతున్నారు. ఆ రోజున ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవాన్ని ఘనంగా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తేదీన తాము అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కార్యాలయానికి తెలిపింది. ఒక వేళ ఈ తేదీ ప్రధానికి కుదరదు అనుకుంటే వేరే పీఎంఓ సూచించే ఏ తేదీకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఇక భోగాపురం ఎయిర్ పోర్టు చూస్తే అతి పెద్ద గ్రీన్ ఫీల్డ్ గా నిర్మించారు. 2,200 ఎకరాలలో అయిదు వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రారంభం అయితే ఉత్తరాంధ్రకే కాదు ఏపీకే కొత్త కళ వస్తుందని భావిస్తున్నరు. ఇక భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి ప్రధాన రహదారి కారిడార్ల పనులు 98 శాతం మేర పూర్తి చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రారంభించిన వెంటనే విమానాశ్రయం తన కార్యకలాపాలకు పూర్తిగా సిద్ధంగా ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే జీఎమ్మార్ గ్రూప్ ఈ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయబడిన ఈ విమానాశ్రయంలో సంవత్సరానికి దాదాపు 60 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తారు అని అంచనా వేస్తున్నారు. 77 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్‌లో 40 చెక్-ఇన్ కౌంటర్లు 26 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు ఉంటాయి. ఇక భోగాపురం విమానాశ్రయం విజయనగరం జిల్లాకు అభివృద్ధి చోదకంగా పనిచేస్తుందని ఆ ప్రాంత వాసులు బలంగా నమ్ముతున్నారు. మరో వైపు చూస్తే శ్రీలంక, మలేషియా, థాయిలాండ్ వంటి తర దేశాలకు విమానాలను నడపడానికి చర్యలు తీసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాజాగా కోరారు. విశాఖపట్నం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి ప్రయాణించే విమాన ప్రయాణికులపై భారాన్ని తగ్గించడానికి, దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ టాక్సీ బైక్ ఆపరేటర్లతో స్థిరమైన చార్జీలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని కూడా అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఒకరిది విధ్వంసం !మరొక రిది వినాశనం!!

**● ఇద్దరు మోడీకి తొత్తులే. ,కేంద్రం తప్పు లను ప్రశ్నించే శక్తి లేని అసమర్ధత కలిగిన నేతలు ● ఒకరిది క్రిమినల్ చరిత్ర మరొకరిది ఆర్ధికనేర చరిత్ర ● రాష్ట్ర ప్రజలకు వినాశనం, నాయకులకు వికాసం జరుగుతుంది ఇది వాస్తవం. ● ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఆలోచన చేయాలి, ఓటు ద్వారా నిజాయితీ నాయకులను తయారు చేద్దాం.... డా. పోతుల నాగరాజు**




**అనంతపురం, జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత 12 సంవత్సరాలనుండి రాష్ట్రములో విధ్వంసం తప్పా ప్రజలకు వికాసం ఎక్కడ? ఇప్పుడు అన్ని వ్యవస్థలు వినాశనం వైపు పరుగులు తీస్తున్నవనీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు విద్య లేదు, వైద్యం లేదు, ఉపాధి లేదు, ఉద్యోగాలు లేవు, తాగడానికి మంచి నీరు లేదు, కార్మికులకు రక్షణ లేదు, రైతు లకు, రైతు కూలీల పరిస్థితి దయనీయంగా ఉంది, పంట లకు గిట్టుబాటు ధర లేదు, మార్కెట్ లో నాణ్యమైన విత్తనాలు లేవు ఎరువులు లేవు, సలహాలు ఇచ్చే అధికారులు లేరు, మరి ఏవిదంగా వికాసం చెందుతారనీ నాగరాజు ప్రశ్నిస్తున్నారు. వికాసం ఎవరికి అంటే గత ప్రభుత్వం లోను, ఇప్పటి ప్రభుత్వం లోను తమ సొంత కులాల వారు వారికీ పెట్టుబడి పెట్టె వారు మాత్రమే వికాసం చెందారన్నారు. నకిలీ మధ్యం, కల్తీ మధ్యం, గంజాయి, డ్రగ్స్, ఇసుక అక్రమ తరలింపు, ఎర్ర చందనం తరలింపు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, దళిత, గిరిజన, బలహీన వర్గాల భూములను ,రాజధాని పేరుతో, సెజ్ ల పేరుతో, పరిశ్రమల పేరుతో, ఓడ రేవుల పేరుతో, విమానాశ్రయల పేరుతో, సోలార్, విండ్ పవర్ పేరుతో లక్షల ఎకరాల భూములు వీరినుంచి, కార్పొరేట్ కంపెనీ లకు అప్పగించి వారి నుంచి వేల కోట్ల రూపాయలు లాభం మీరు పొంది మీరు మీ కుటుంబం మీ కులాలు వికాసం చెందినది వాస్తవం కదా అన్నారు. ఇలా ఎన్ని సార్లు ప్రజలను మోసం చేస్తారు, ఏదో ఒక రోజు మీ పాపం పండుతుంది. ప్రజల హక్కు లను కాల రాస్తున్నారు, వ్యవస్థ లను విధ్వంసం నుంచి వినాశనం వైపు పరుగులు తీయిస్తున్నారు, రాజ్యాంగం పట్ల గౌరవం లేదు, ప్రజల పట్ల ప్రేమ లేదు, ఇలా ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకోని ప్రజలను తప్పు దోవ పట్టించే మీ సొంత కుల పత్రికలు, ఛానల్ లను అడ్డుపెట్టుకొని రాష్ట్ర ప్రజలను దివాళా తీయిస్తూ రాష్ట్ర వనరులను కొల్లు గొడుతున్నారు ఇది మీ ఇద్దరి పాలనలో జరుగుతున్నదన్నారు. ప్రజలకు, యువత కు, మేధావులకు,సోషల్ మీడియా మిత్రులకు విజ్ఞప్తి వాస్తవం తెలుసు కొని ఈ పార్టీ ల కుట్రల నుంచి రాష్ట్ర ప్రజలకు, రాష్టానికి రక్షణ కోసం కాకరోచ్ ఉద్యమం కంటే బలమైన ఉద్యమం ఆంధ్రప్రదేశ్ లో నిర్మిద్దాం ముందుకు రండి అని డా. పోతుల నాగరాజు అన్ని వర్గాల వారికి పిలుపునిచ్చారు.

# ప్రజలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నాం

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ**







**విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశా అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం శనివారం ఉదయం బర్మ్ పార్క్, భవానిపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశా, డైరెక్టర్ ఆయుష్ గోపాలకృష్ణ రోనంకి, జాయింట్ కలెక్టర్ ఇలేకియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని విజయవంతంగా గత నాలుగు వారాలుగా నిర్వహిస్తున్నామని, ఒకవైపు యోగాంధ్రతో శరీరాన్ని మనసుని ఆరోగ్యంగా ఉంచుకుంటూ మరోవైపు ఆపరేషన్ క్లీన్ స్వీప్ తో నగరాన్ని పరిశుభ్రపరుస్తున్నామని అన్నారు. అందులో ముఖ్య పాత్రులైన పారిశుద్ధ్య కార్మికులు, వారు కేవలం కార్మికులు మాత్రమే కాదు దైవికులతో సమానమని అన్నారు. ఎండైనా వానైనా వాతావరణంతో సంబంధం లేకుండా అన్ని పరిస్థితుల్లోనూ నగరాన్ని పరిశుభ్రపరుస్తూ ప్రజల్ని ఆరోగ్యవంతులుగా ఉంచడంలో వారు చేస్తున్న పని అనిర్వచనీయమన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని గత నాలుగు వారాలపాటుగా ప్రతి ఒక్క వారం ప్రత్యేకమైన అంశాలతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మొదటి వారం రెడ్ స్పాట్ ఎల్లో స్పాట్ విసిబుల్ తో పాటు రెండో వారం స్టాం వాటర్ డ్రైన్స్, కాలువల డీసిల్టింగ్ అలాగే మూడో వారం బెల్క్ వేస్ట్ జనరేటర్లకు ఒక ప్రత్యేకమైన వ్యర్థాల నిర్వహణ పై అవగాహన కల్పించడమే కాకుండా నాలుగు రంగుల చెత్తబుట్టల వినియోగంపై ప్రజల్లో వివిధ ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కల్పించామని అన్నారు. ఈ వారం అంశం గార్బేజ్ వన్నెలబుల్ పాయింట్స్ మరియు పబ్లిక్ టాయిలెట్స్ అని అందులో భాగంగా నగరంలోని మరుగుదొడ్లు అన్నిటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిశుభ్రంగా నిర్వహించుకోవటమే కాకుండా ప్రజలు కూడా తమ తమ ఇళ్లలో మరుగుదొడ్లను తరచుగా పరిశుభ్రపరచాలని అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రత్యేకంగా గార్బేజ్ వల్లరబల్ పాయింట్స్ లో ఎటువంటి వ్యర్థాలు లేకుండా ఉండేటట్టు చర్యలు తీసుకుంటున్నామని వాటిని సురక్షితమైన అందమైన ప్రదేశాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆయుష్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను ఇతరత నగరాల్లో పనిచేశారని ఏ నగరం విజయవాడ అంతా పరిశుభ్రంగా లేదని, విజయవాడ నగరం కేవలం ఆంధ్రప్రదేశ్ లో ఒక నగరం మాత్రమే కాకుండా ఒక విదేశీ నగరంగా ఉందని అంత అందంగా, ఆహ్లాదంగా, పరిశుభ్రంగా, పచ్చని చెట్లతో ఉందని అన్నారు. నగరంలోని నది, మూడు కాలువలు ఉండటం ఎంత కష్టమో వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ విజయవాడ నగరం పరిశుభ్రతకులో అత్యుత్తమ స్థానంలో నిలుపుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలేకియా మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పారిశుధ్య నిర్వహణలో ఎంతో అత్యుత్తమ స్థానంలో ఉందని దానికి ముఖ్య కారకులైన పారిశుధ్య కార్మికులు ఉదయం నుండి రాత్రి వరకు కష్టపడుతున్న కష్టం నగర పరిశుభ్రతల్లో కనిపిస్తుందని, ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా వివిధ కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా పూర్తిస్థాయిలో వాటిని నిర్వహించడం తాను గమనించారని, అందుకు విజయవాడ నగరపాలక సంస్థకు అభినందనలు తెలిపారు. తదుపరి పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడమే కాకుండా దగ్గరిలోని గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ని తమ చేతులతో అక్కడున్న వ్యర్థాలను తీసి పరిశుభ్రపరచటమే కాకుండా అందమైన రంగులు పూసి తరచుగా వ్యర్థాలు పడే ప్రదేశాన్ని అందమైన ప్రదేశంగా మార్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి చంద్రశేఖర్, శకుంతల, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరీష్, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే లక్ష్యంగా సుజనా ఫౌండేషన్ఉచిత మెగా వైద్య శిబిరాలు..



**విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి, "సుజనా ఫౌండేషన్" ద్వారా ప్రారంభించిన ఉచిత మెగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుంది.పశ్చిమ లోని పేద , మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరంతరం ఉచితంగా అందించేందుకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేపడుతున్నారు.. ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా హెచ్.బీ కాలనీలో శనివారం ప్రారంభించిన ఉచిత వైద్య శిబిరాలను పశ్చిమ ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకున్నారు..ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ ఆరోగ్య శిబిరంలో పూర్తిగా ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్ రే , వంటి పరీక్షలు నిర్వహించారు.. జనరల్ మెడిసిన్,డెంటల్, కంటి పరీక్షలు, వంటి అనేక అనారోగ్యాలపై 130 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించారు. అవసరమైన వారికి అక్కడికక్కడే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు..దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభించింది.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో , సుజనా ఫౌండేషన్ ద్వారా వారాంతంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు..ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ కామినేని అచ్యుతరామయ్య, డాక్టర్ దిలీప్ ( జనరల్ మెడిసిన్ ) శంకర నేత్ర చికిత్సలయం డాక్టర్ వీర్ల అంకమ్మ, డాక్టర్ అశ్విత, గవర్నమెంట్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్స్, మరియు టెక్నీషియన్స్ అనిల్, సంతోష్, మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య, పత్తి నాగేశ్వరరావు, కూటమి నేతలు తిరుపతి అనూష, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, అల్లంకి శ్రీనివాస్ , జయబాలన్,సుజనా మిత్రా కోఆర్డినేటర్లు ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందించారు..

# శ్రీ దేవీ కరుమారి అమ్మన్ సన్నిధిలో ప్రత్యేక హోమాలు

**వేలాది గా తరలి వచ్చిన భక్తులు**







**విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అష్టాదశ శక్తి పీఠ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర -2026 నీ సంపూర్ణం చేసుకొని పీఠానికి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ కరుణానంద నాథ గురువుని పీఠం భక్తులు మరియు కుటుంబ సభ్యులు సాధరంగ ఆహ్వానించి గురుపాదుక పూజలను శనివారం ఉదయం నిర్వహించారు. శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో సామూహిక కుంకుమార్చనలు రుద్రాభిషేకం మరియు అమ్మ వారి హోమములు నిర్వహించడం జరిగినది. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించి పీఠాధిపతులు చేతుల మీదుగా తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాబలూరి లోకనాథ శర్మ గురువు, కొరగంజి ప్రభాకర్ రావు, హేమంత్ కుమార్, చలవాది ప్రకాష్ ధరణికోట చరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# మోడీ సారిధ్యంలోని బీజేపీ ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా భారతదేశం

**బిజెపి పట్టణ అధ్యక్షురాలు మాధురి**
**అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం లో ప్రత్యేక పూజలు**



**ఇబ్రహీంపట్నం, జూన్ 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** బీజేపీ ప్రగతి పథంలో ముందుకు దూసుకెళ్తూ 12 ఏళ్ల విజయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం బిజెపి కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. 2014 సబ్కా సాత్సబ్కా వికాస్ ప్రధానమంత్రి నరేం ద్ర మోడీ సారథ్యంలో అన్ని వర్గాలకు మేలు చేస్తూ, దేశాన్ని ముందుకు నడిపిస్తున్నా రని... ఆయనకు అందరి ఆశీస్సులు ఉండాలని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ప్రధాన కార్యదర్శులు దాము భవాని,శనాపతి నాగమణి,సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథ రెడ్డి, కూనల యుగంధర్, అద్దేపల్లి ఆంజనేయులు, ఉప్పల వెంకట రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సు

**బూత్ స్థాయి నుంచే పార్టీ బలోపేతం కావాలి**
**కార్యకర్తలకు, ప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన**
**కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**
**రాష్ట్ర పర్యవేక్షకులు, సీనియర్ నాయకుల సమక్షంలో**
**ఘనంగా శిక్షణ శిబిరం**





**కొంపల్లి, జూన్ 13, (వార్తాప్రభ)** : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ స్థాయి ప్రతినిధులకు (బీఎల్ఏ) అవగాహన మరియు శిక్షణ శిబిరం కొంపల్లిలోని ఎస్ఎన్ఆర్ తోట (గార్డెన్స్) ఆవరణలో శుక్రవారం వైభవంగా జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక పర్యవేక్షకులు ఫయీమ్, రాష్ట్ర ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్) అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, హరీష్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మరియు నియోజకవర్గ సమన్వయకర్త ఏపీ మిథున్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని పోలింగ్ బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే, పార్టీ బలోపేతానికి పునాదులు వేయాలన్నారు. సమావేశ అధ్యక్షుడు కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, చనిపోయిన మరియు ఇళ్లు మారి వెళ్లిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను బూత్ స్థాయి ప్రతినిధులు ఎంతో బాధ్యతగా పర్యవేక్షించాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంతో పనిచేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమగ్ర అవగాహన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పూర్వ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రోటోకాల్ ఉపాధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మితో పాటు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల (డివిజన్) ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేశారు.



# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో లోపాలు.. నగరంలో అసంపూర్ణ పారిశుద్ధ్య పనులు



**మచిలీపట్నం జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో నెల రోజుల పాటు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 123 స్థానిక సంస్థల పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం తొలగించడం, డ్రెయిన్లు, మురుగు కాలువల్లోని వ్యర్థాలను తొలగించడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం, మురికి పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడం వంటి లక్ష్యాలతో కార్యక్రమం కొనసాగుతోంది. మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పర్యవేక్షణలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో గత పది రోజులుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు డివిజన్లలో రోడ్ల శుభ్రత, డ్రెయిన్లు, మురుగు కాలువల శుద్ధి పనులు చేపట్టారు. అయితే పనుల అమలులో పలు లోపాలు కనిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయిన్లు, కాలువల్లో నుంచి తొలగించిన పూడిక, చెత్తాచెదారాన్ని వెంటనే తరలించఆపరేషన్ క్లీన్ స్వీప్ తో పాటు.. నగరంలో అసంపూర్ణ పారిశుద్ధ్య పనులుకుండా రోడ్ల పక్కన లేదా కాలువల గట్లపైనే వదిలేస్తున్నారని చెబుతున్నారు. దీంతో మళ్లీ మురికి పేరుకుపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కోర్టు వెనుక ప్రాంతంలోని డ్రెయిన్ను శుభ్రం చేసినప్పటికీ తీసిన పూడికను అక్కడే వదిలివేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే కొన్ని కాలువల్లో పూడిక పూర్తిగా తొలగించకపోవడంతో పాటు, డ్రెయిన్లలో పెరిగిన పచ్చటి నాచును కూడా తొలగించలేదని విమర్శిస్తున్నారు. పది రోజులుగా పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ కొన్ని డివిజన్లలో పూర్తి స్థాయిలో శుభ్రత పనులు జరగలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు సమగ్ర కార్యాచరణతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు పూర్తి చేసి, మచిలీపట్నాన్ని స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## రక్తదానంపై అవగాహన కల్పించిన రుయా ఆసుపత్రి



**తిరుపతి, జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచ రక్తదాతల దినోత్సవం-2026 సందర్భంగా రుయా ఆసుపత్రిలో శనివారం రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ, దేశంలో రక్త అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. "నా రక్తాన్ని క్రమం తప్పకుండా దానం చేస్తాను" అనే ప్రతిజ్ఞను కార్యక్రమంలో పాల్గొన్న వారితో చేయించారు. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, సహోద్యోగుల్లో రక్తదానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరికైనా రక్తం అవసరమైనప్పుడు ఎటువంటి వివక్ష లేకుండా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ఇది గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి సిబ్బంది, వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 20న హనుమాన్ శోభాయాత్ర



**ఆత్మకూరు జూన్ 13 (వార్తాప్రభ)** ఆగస్టు 20వ తేదీ ఆదివారం సాయంకాలం 4.00 గంటలకు ఆత్మకూరు పట్టణంలో నిర్వహించబడనున్న హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరగనున్నది. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయుటకు రామభక్తులు హనుమాన్ భక్తులు ఉమ్మడిగా సమాయత్తమై విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా నిన్నటి రోజున దేపూరు మహిమలూరు డీసీపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించి గ్రామ ప్రజలను శోభాయాత్రకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గ్రామపెద్దలు పూజారులు మరియు ప్రముఖులను కలిసి ఈ దైవ కార్యంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న గ్రామస్థులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ "ఇది దైవ కార్యక్రమం" మనమందరం కలిసి ఉమ్మడిగా విజయవంతం చేద్దాం" అని తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. వారి ప్రోత్సాహకరమైన స్పందన కార్యక్రమ నిర్వాహకులకు మరింత ఉత్సాహాన్ని బలాన్ని అందించింది.

## కిడ్నీ వ్యాధి గ్రస్తుడికి ఉపాధ్యాయ దంపతుల చేయూత



**చేజర్ల జూన్ 13 (వార్తాప్రభ)** చేజర్ల గ్రామం నివాసి షేక్ మహబూబ్ భాషా అనే వ్యక్తి గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటూ ఇంటికే పరిమితమై జీవనోపాధి కోల్పోయి ఉన్న పరిస్థితినీ చూసి చేజర్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు షేక్ సాదిక్ షేక్ షకీలా ఇద్దరు కలిసి 5000 వేల రూపాయలు శనివారం ఆయన చేతికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ మరియు షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

## శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



**తిరుపతి, జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న "ఏపీ దర్శన్" కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. రాష్ట్రంలోని అభివృద్ధి నమూనాలు, పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకునే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. శ్రీసిటీకి చేరుకున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులకు సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీసిటీ ఏర్పాటుకు దారితీసిన అంశాలు, పారిశ్రామిక పార్క్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల సృష్టి, విదేశీ మరియు దేశీయ పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ నిర్వహించారు. శ్రీసిటీ అభివృద్ధి ప్రస్థానం, పారిశ్రామిక యూనిట్ల స్థాపన, ఎగుమతుల ప్రోత్సాహం వంటి విషయాలను అధికారులు ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు శ్రీసిటీలోని వివిధ పారిశ్రామిక ప్రాంతాలను సందర్శించి అక్కడి కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ అయిన మొండెలెజ్ పరిశ్రమను సందర్శించిన వారు ఉత్పత్తి ప్రక్రియలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నాణ్యత నియంత్రణ ప్రమాణాలు, భద్రతా విధానాలు తదితర అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చించారు. పరిశ్రమలో అమలవుతున్న అత్యాధునిక యంత్రాంగం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయని ట్రైనీ అధికారులు అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, పెట్టుబడులను ఆకర్షించడంలో శ్రీసిటీ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా పారిశ్రామిక అభివృద్ధి, పరిపాలనా వ్యవస్థ, పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అంశాలపై తమకు విలువైన అవగాహన లభించిందని ట్రైనీ ఐఏఎస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కైలాసధామం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందించిన సుధాకర్ చౌదరి



**చంద్రగిరి, జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరి పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక కైలాసధామం (గోవిందధామం) ప్రాజెక్టుకు భీమవరం వాస్తవ్యులు కూరపాటి సుధాకర్ చౌదరి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. దివంగత కూరపాటి రామచంద్ర నాయుడు కుమారుడైన సుధాకర్ చౌదరి ఈ విరాళాన్ని సామాజిక బాధ్యతగా అందించి తన ఉదారతను చాటుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవతో రూపుదిద్దుకుంటున్న కైలాసధామం ప్రాజెక్టు అంతిమ సంస్కారాలను అత్యంత గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయబడుతోంది. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణంలో సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కైలాసధామం నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సమాజానికి ఉపయోగపడే ఈ పవిత్రమైన కార్యక్రమంలో కూరపాటి సుధాకర్ చౌదరి భాగస్వామ్యం కావడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కైలాసధామంలో ఆకర్షణీయమైన పార్కులు, అంతర్గత రహదారులు, తాగునీటి సదుపాయం, ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న ఈ మహత్తర యజ్ఞంలో మరిన్ని దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు సుధాకర్ చౌదరిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కైలాసధామం పూర్తయితే నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

## నూతన తహసిల్దార్ శిరీషని మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు



**జగ్గయ్యపేట: జూన్ 13 (వార్తప్రభ)**జగ్గయ్యపేట మండలానికి నూతనంగా విచ్చేసిన తహసిల్దార్ శిరీషని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, జగ్గయ్యపేట సబ్ బ్రాంచ్ చైర్మన్ గోగుశెట్టి . మహేష్, ట్రెజరర్ మానేపల్లి నాగ బ్రహ్మం ల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ శిరీషకి రెడ్ క్రాస్ ప్రతినిధులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం జగ్గయ్యపేట పరిధిలో రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ద్వారా చేపడుతున్న వివిధ సామాజిక, మానవతా సేవా కార్యక్రమాలను ఆమెకు వివరించారు. స్థానికంగా రెడ్ క్రాస్ సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై, భవిష్యత్ కార్యాచరణపై తహసిల్దార్ తో సుదీర్ఘంగా చర్చించారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు స్థానిక సబ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ గా తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా తహసిల్దార్ హామీ ఇచ్చారు.

**కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ఆవరణలో ఘనంగా రక్తదాన శిబిరం**జూన్ 14న జరగనున్న 'ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని' (వరల్డ్ బ్లడ్ డోనార్స్ డే ) పురస్కరించుకొని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్గయ్యపేట పరిధిలోని ప్రముఖ పరిశ్రమ 'కోహెన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆవరణలో భారీ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ప్లాంట్ హెడ్/ఇంచార్జ్ శ్యాంప్రసాద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ఉత్సాహంగా తరలివచ్చి రక్తదానం చేశారు. మొత్తం 77 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని అందజేయడం విశేషం. రక్తదానం ప్రాణదానంతో సమానమని, సేకరించిన ఈ రక్తం అత్యవసర సమయాల్లో ఎందరో ప్రాణాలను కాపాడుతుందని రెడ్ క్రాస్ జిల్లా



నిర్వహణా కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మరియు సబ్ బ్రాంచ్ చైర్మన్ మహేష్ పేర్కొన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి సహకరించిన కోహెన్స్ ప్లాంట్ హెడ్ శ్యాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ సురేష్ కి, ఇతర మేనేజ్మెంట్ సిబ్బందికి మరియు రక్తదానం చేసిన 77 మంది దాతలకు రెడ్ క్రాస్ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేసింది. రెడ్ క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్ మోహన్ ఆద్వర్యం లో శిబిరాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాలలో రెడ్ క్రాస్ ప్రతినిధులు, కోహెన్స్ ఫ్యాక్టరీ సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## లివర్ వ్యాధితో బాధపడుతున్న బాలికకు పోలీసుల సాయం



**ఇబ్రహీంపట్నం, జూన్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతున్న 11 ఏళ్ల బాలిక పి.లోసికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న లోసి గత కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతోంది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పోలీస్ ఫర్ పూర్ చిల్డ్రన్ స్పందించారు. శనివారం చిన్నారి ఇంటికి వెళ్లి రూ.10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. పోలీసుల సహృదయతను కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

## మూడు నెలల కష్టం.. గంటల్లో మాయం..! రైతుల ఆవేదన





**చంద్రగిరి, జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):** చంద్రగిరి మండల పరిధిలోని రాయలపురం సమీపంలో ఉన్న ఓ రైస్ మిల్లో రైతులు మోసపోతున్నారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టార్జిత పంటను బియ్యంగా మార్చుకునేందుకు రైస్ మిల్కు తీసుకెళ్తే, రావాల్సిన పరిమాణం కంటే తక్కువ బియ్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులు ఈ విషయంపై మిల్ యజమానిని ప్రశ్నించినప్పటికీ, సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికే యూరియా కొరత, పెరిగిన సాగు ఖర్చులు, కూలీల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ పరిస్థితి మరింత భారంగా మారిందని పేర్కొంటున్నారు. పగలనక రాత్రనక మూడు నెలల పాటు కష్టపడి పండించిన పంటను ఒకవైపు దళారులు, మరోవైపు కొందరు రైస్ మిల్ యజమానులు దోచుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడ్లను బియ్యంగా మార్చే ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైస్ మిల్లో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టి, రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల శ్రమను దోపిడీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "అన్నదాతకు న్యాయం చేయాలి.. వడ్ల మార్పిడిలో పారదర్శకత తీసుకురావాలి" అని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పారిశుద్ధ కార్మికుల ఆరోగ్య భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



**జగ్గయ్యపేట, జూన్ 13 (వార్తప్రభ)** నియోజకవర్గంలోని చిల్లకల్లు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ కార్మికులు అనేక సందర్భాల్లో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురికి నీటిని తగిన రక్షణ పరికరాలు లేకుండానే తొలగించాల్సి వస్తోంది. కొంతమంది కార్మికులు చేతి తొడుగులు, గమ్‌బూట్లు, మాస్కులు, రక్షణ దుస్తులు లేకుండా నేరుగా మురికి నీటిలో పని చేయడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉంది. మురికి నీటిలో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు, విషపూరిత వాయువులు మరియు ఇతర హానికర పదార్థాల వల్ల చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, కంటి ఇన్‌ఫెక్షన్లు మరియు ఇతర అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పారిశుద్ధ కార్మికుల ఆరోగ్య భద్రతను కాపాడడం అధికారుల ప్రాథమిక బాధ్యత. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రతి పారిశుద్ధ కార్మికునికి క్రింది భద్రతా సామగ్రిని తప్పనిసరిగా అందించాలి. నాణ్యమైన చేతి తొడుగులు, గమ్‌బూట్లు, ముఖానికి మాస్కులు, రక్షణ కళ్లద్దాలు, పూర్తి శరీరాన్ని కప్పే రక్షణ దుస్తులు (యూనిఫాం), శానిటైజర్లు మరియు సబ్బులు, ప్రథమ చికిత్స కిట్, కాలానుగుణ ఆరోగ్య పరీక్షలు మరియు వైద్య సదుపాయాలు. అదేవిధంగా కాలువల శుభ్రపరిచే పనుల్లో సాధ్యమైనంత వరకు యంత్రాలను వినియోగించి, కార్మికులు నేరుగా మురికి నీటిలోకి దిగే పరిస్థితులను నివారించాలి. కార్మికుల భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేసి, వారికి అవసరమైన శిక్షణ కూడా అందించాలి. పారిశుద్ధ కార్మికుల సేవలు సమాజానికి అమూల్యమైనవి. వారి ఆరోగ్యం, భద్రత మరియు గౌరవాన్ని కాపాడటం ప్రతి అధికార యంత్రాంగం మరియు ప్రజల సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా సామాజికవేత్త శ్రీరామ్ సింగ్ తెలిపారు.

## మినిస్టర్ విజయశాంతి... ఒక బెర్త్ ఆమెకు కంఫర్మ్ ?

**హైదరాబాద్ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సినీ రంగంలో దశాబ్దాల పాటు టాప్ హీరోయిన్ గా రాణించిన విజయశాంతి రాజకీయాల్లోనూ తనదైన హవా చాటుకుంటూ వచ్చారు. మెదక్ నుంచి ఒకసారి ఎంపీగా గెలిచిన ఆమె తాజాగా కాంగ్రెస్ లో ఎమ్మెల్సీ అయ్యారు. అనూహ్యంగా కేంద్ర కాంగ్రెస్ పెద్దల సిఫార్సులతో ఎమ్మెల్సీగా చోటు సంపాదించిన విజయశాంతి ఇపుడు మంత్రి పదవి కోసం పావులు కదుపుతున్నారని అంటున్నారు. కాంగ్రెస్ లో చేరిన ఆమె ఎమ్మెల్సీ అయినా మౌన ముద్రలోనే ఉంటున్నారు. శాసనమండలిలో ఆ మధ్య ప్రభుత్వం మీద పరోక్ష విమర్శలు చేసిన విజయశాంతి తనలోని అసంతృప్తిని ఆ విధంగా చాటారు అని గుర్తు చేస్తున్నారు. తమ స్థాయికి తగినట్లుగా మంత్రి పదవి రావడం లేదన్న ఆవేదన ఆమెలో ఉంది అని అంటున్నారు. దూరంగానే ఉంటూ : కాంగ్రెస్ లో చేరిన ఆమె ఎంపీగా పోటీ చేయాలనుకున్నారు. కానీ 2024లో సీటు దక్కలేదు, ఇక ఎమ్మెల్సీగా ఆమె పేరుని హైకమాండ్ దగ్గరుండి మరీ పెట్టించింది అని చెప్పుకున్నారు. దాంతో కేంద్ర నాయకులతోనే టచ్ లో ఉంటూ వస్తున్న విజయశాంతి తెలంగాణా కాంగ్రెస్ రాజకీయాల్లో అంటీ ముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరంగానే ఉంటున్నారు అని ప్రచారం సాగుతోంది. మరో వైపు చూస్తే పార్టీ తన సేవలను పూర్తి స్థాయిలో వాడుకోవడం లేదన్న బాధ కూడా ఆమెకు ఉందని అంటున్నారు. ఇక మంత్రి పదవి కోసం విజయశాంతి ఎదురుచూస్తున్నారు అన్న చర్చ కూడా సాగుతోంది. ఇదిలాఉంటే తెలంగాణాలో కాంగ్రెస్ మంత్రి వర్గ విస్తరణ త్వరలో ఉంటుందని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. కేబినెట్ లో కొన్ని ఖాళీలు ఉన్నాయి. అదే సమయంలో పనిచేయని వారిని తీసి పక్కన పెట్టాలని కూడా కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారని అంటున్నారు. అలా చూసుకుంటే కనీసంగా అరడజన్ నుంచి గరిష్టంగా ఎనిమిది దాకా మంత్రి పదవులు కొత్తగా తీసుకునే చాన్స్ ఉందని ప్రచారం సాగుతోంది. సామాజిక ప్రాంతీయ సమతూల్యతతో పాటు గ్లామర్ ఉన్న వారికి పార్టీ వాయిస్ ని ప్రభుత్వం అజెండాను జనంలోకి తీసుకుని వెళ్లే వారికే ప్రాధాన్యత అని కూడా చెబుతున్నారు. దాంతో సినీ రంగంలో అగ్రశ్రేణి తారగా వెలుగొంది రాములమ్మగా జనాల చేత పిలిపించుకుంటున్న విజయశాంతి తన ఇమేజ్ తో మంత్రి కావాలని చూస్తున్నారు అని అంటున్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు.. నిరసన ర్యాలీ ఘనవిజయం

-కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు.. వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ విజయవంతం కావడంతో వైసీపీ నాయకులు గుడివాడలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై మరిన్ని ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయడంపై నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ తీరును ప్రతి ఇంటికి తీసుకెళ్తామని వెల్లడించారు. మాజీ మంత్రి కొడాలి నాని ర్యాలీలో పాల్గొనడంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొందని, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ విజయోత్సవం కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజల పక్షాన వైసీపీ అండగా ఉంటుందని నాయకులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొంకితల ఆంజనేయ ప్రసాద్, ఎస్ కె బాజీ, షేక్ సయ్యద్, తుళ్ళిమిల్లి యేషయ్య, షమ్ము తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర సంక్షోభంలో పొగాకు రైతులు

-వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** గతంతో పోలిస్తే కేవలం రెండు రబీ సీజన్ల లోనే రాష్ట్రంలో పొగాకు రైతులు తీవ్ర ఆర్ధిక సంక్షోభం ఉన్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. శనివారం అయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రైతు ఆర్ధిక సంక్షోభంలో ఉంటే ప్రభుత్వానికి ఆదాయం ఎలా వస్తుంది. తన కుటుంబాన్ని ఎలా పోషించాలన్నారు. ఈ రబీ సాగులో పొగాకు అమ్మకం ధర దారుణంగా ఉందన్నారు. ఈ ఏడాది రబీ తీసుకుంటే సాగు విస్తీర్ణం గత సంవత్సరం 1.20 లక్షల హెక్టార్లు అయితే ఈ సంవత్సరం 1.17 లక్షల హెక్టార్లున్నారు. ముందస్తు అంచనా ప్రకారం హెక్టారు సరాసరి దిగుబడి 2221 కిలోలు. దీని ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఉత్పత్తి అంచనా షుమారు 260 మిలియన్ కేజీలు ఉత్పత్తి రావాలి. ఇప్పుడు సరాసరి అమ్మకం ధర రూ 230.58లో ఉందన్నారు. రైతులు సరాసరిన కిలోకు 58.07 రూ నష్టపోతున్నారు. దీనికి పెరిగిన ఉత్పత్తి వ్యయం సంవత్సరానికి కిలోకు కనీసం 10రూ చొప్పున రెండు సంవత్సరాలకు 20రూ అదనపు నష్టం వచ్చిందన్నారు. దక్షిణాది నల్ల నేలల పరిధిలోకి వచ్చేసరికి ఒంగోలు1, ఒంగోలు2, టంగుటూరు1, కొండెపి, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో గతంలో సరాసరి తిరస్కరణ బేళు దక్షినాది తేలిక నెలలు పొదిలి -1, కనిగిరి, కందుకూరు -1,కందుకూరు -2, కలిగిరి, డిసిపల్లి వేలం కేంద్రాలలో తిరస్కరించిన బేళ్లు, ఇలా తిరస్కరించిన బేళ్లను వెనక్కి తీసుకెళ్లడానికి బేలుకు రూ.2 వేలు అదనంగా ఖర్చవుతుందన్నారు. ఇప్పటికే 63 వేలం రోజులు దాటి పోయిందన్నారు. ఈ సంవత్సరం ఉత్పత్తి అంచనా షుమారు 265 మిలియన్ కేజీలు అయితే 12/6వ తేది వరకూ 17.29 మిలియన్ కేజీలు మాత్రమే మార్కెట్లో వేలం జరిగిందన్నారు. గత సంవత్సరం 63 వేలం రోజులలో 48.84 మిలియన్ కేజీలు వేలం జరిగింది. ఇంత సంక్షోభంలో పొగాకు రైతులు కూరుకుపోతుంటే, ప్రభుత్వం యంత్రాంగం తీసుకున్న చర్యలు ఏమిటిన్నారు. మొట్ట మొదటి సారిగా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పొగాకును కూడా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయించారు. ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ఆ ప్రయత్నం ఎందుకు చెయ్యటం లేదో అర్ధం కావటం లేదున్నారు. మంచి దిగుబడి, క్వాలిటీ ఉత్పత్తి పండించి కూడా అమ్మకం ధరలు కుప్ప కూలి పోవడం మూలంగా రైతు తీవ్ర ఆర్ధిక సంక్షోభం లోనికి వెళ్లి పోతున్నాడని అవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పంట పండిస్తే రైతుకు ఆదాయం రాదు, లాభసాటి ధర లభిస్తేనే రైతుకు లాభం వస్తుంది. ఈ మూడు సీజన్ల పొగాకు సాగును పరిశీలిస్తే క్లియర్‌గా అర్ధం అవుతుందన్నారు. రైతాంగం ఇంత సంక్షోభంలోకి వెళ్లిపోతూ ఉంటే అత్యధిక శాతం కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులు ఆర్ధిక సంక్షోభంలో కూరుకుపోతే తెచ్చిన అప్పులు కట్టలేని పరిస్థితుల్లో ఉంటే, రుణాలు తెచ్చినా పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఉంటే ఇప్పటికైనా ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకుని వ్యవసాయ ఉత్పత్తుల గిట్టుబాటు ధరలపై ద్రుష్టి పెట్టకపోతే రాష్ట్ర వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభం లోనికి వెళ్లి పోయి తదనుగుణంగా రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి కూడా ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని తన ప్రకటనలో తెలిపారు.

# SIR లో గుడివాడను మొదటి స్థానంలో నిలపాలి..

- SIR ప్రక్రియపై క్లస్టర్ ఇంచార్జ్‌లతో సమావేశమైన ఎమ్మెల్యే రాము..
- నిపుణులతో మాట్లాడి ఇంచార్జ్‌ల సందేహాలను నివృత్తి చేసిన ఎమ్మెల్యే..



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** SIR ప్రక్రియపై టీడీపీ యంత్రాంగమంతా పూర్తి ఫోకస్ పెట్టి పనిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వెరిఫై ప్రక్రియలో గుడివాడ మొదటి స్థానంలో ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమవారం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రారంభం కానున్న నేపథ్యంలో టీడీపీ మండల అధ్యక్షులు, గుడివాడ నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్‌లతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం ప్రజా వేదిక కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో SIR ప్రక్రియ, ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటర్ల మ్యాపింగ్, ఐడెంటిఫికేషన్, నూతన ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఎమ్మెల్యే రాము దిశానిర్దేశం చేశారు. క్లస్టర్ ఇంచార్జ్‌లు లేవనెత్తిన పలు సందేహాలను నిపుణులతో స్పీకర్ ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే నివృత్తి చేశారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎదురవుతున్న సమ-స్యలను ఇంచార్జ్‌లు ప్రస్తావించగా, వాటిపై పరిష్కార మార్గాలు సూచించారు. ఈ ప్రక్రియకు సహకారంగా ప్రజావేదిక కార్యాలయంలో పది మందితో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. అనంతరం క్లస్టర్ ఇంచార్జ్‌లకు పలు సూచనలు చేస్తూ ఎమ్మెల్యే రాము మాట్లాడారు. గ్రామాల్లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ అధిక శాతంలో పూర్తయినా, పట్టణ ప్రాంతంలో ముందుకు సాగడంలో అవాంతరాలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గుడివాడ పట్టణంలో గుర్తించని ఓటర్లు 30 శాతం ఉన్నారని సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగరీత్యా వేరే ఊర్లలో ఉన్నవారిని గుర్తించాలని, నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. టౌన్‌లో అప్రమత్తంగా ఉండాలని, అందరూ బాధ్యతతో పనిచేస్తూ ఐడెంటిఫై కాని ఓటర్లను గుర్తించాలన్నారు. SIR సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా బీఎల్ఓలతో టీడీపీ బూత్ లెవెల్ ఏజెంట్లను సమన్వయపరుస్తూ క్లస్టర్ ఇంచార్జ్‌లు పనిచేయాలన్నారు. స్థానిక ఓటర్ల వివరాలపై బూత్ లెవెల్ ఏజెంట్లకు పూర్తి అవగాహన ఉన్నందున వెరిఫికేషన్‌లో బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. 90 శాతం పైగా ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, వెరిఫై ప్రక్రియలో గుడివాడ మొదటి స్థానంలో ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జులై 14లోపు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని, ఈ ప్రక్రియపై పూర్తిస్థాయి ఫోకస్ పెట్టాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుపై కూడా అవగాహన కల్పించాలన్నారు. యువ ఓటర్లు టీడీపీపై సానుకూలంగా ఉన్నారని, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్ల జాబితాలో నమోదు చేయించాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ ప్రతి ఓటరు నమోదు చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. సమావేశంలో గుడివాడ, రూరల్ ,గుడ్లవల్లేరు, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, వాసే మురళి, పోలవరపు వెంకట్రావు, దానేటి సన్యాసి రావు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ లు ఉబ్బల వెంకటేశ్వరరావు, వల్లభనేని సుబ్బారావు అడుసుమిల్లి శ్రీనివాస్, కొడాలి రామరాజు, సయ్యద్ జబీన్, మాదల సురేష్, నేరుసు కాశి, మధుసూదన్ రావు, బొంబాయి శ్రీను, పంచుమర్తి శ్రీనివాస్, మురళి క్రాంతి, ప్రదీప్, బద్రి, వంశీ, రాము, జానీ, గుడివాడ తెలుగు యువత అధ్యక్షుడు లోయ విజయ్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీ లు నిర్వహించిన మండల తహసీల్దార్ రవీంద్రనాధ్






**పెనుగంచిప్రోలు,జూన్ 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు తహసీల్దార్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పలు మెడికల్ షాపులు శనివారం తనిఖీలు నిర్వహించిన్నారు, ప్రతి షాపులో సంబంధిత అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని యజమానులకు సూచించారు,కాలం చెల్లిన మందులను విక్రయించరాదని, మందుల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించి రోగులకు అందించాలని ఆదేశించారు. మెడికల్ షాపులో చికిత్స లు నిర్వహించరాదనీ హెచ్చరించారు.అలాగే పెట్రోల్ బంకు లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాణ్యత గల పెట్రోల్ ను డీజిల్ ను వాహనదారుల కు అందజేయాలని సూచించారు, తనిఖీలల్లో ఆర్ఐ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు..

# రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ భవన స్థల దాత సుఖీభవ



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** స్థానిక రోటరీ గుడివాడ క్లబ్బు ఏర్పాటు జరిగి 68 సంవత్సరాలు అయింది. అయినా శాశ్వత భవనం లేకపోవడం విచారకరం అని ప్రముఖ రొటేరియన్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్ జీవి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో రోటరీ మీటింగ్ జరిగింది. 1958 లో ప్రారంభమైన రోటరీ క్లబ్ కు గుడివాడ పట్టణం నుంచి పలువురు సభ్యులు ఉన్నారు. సభలు సమావేశాలు నిర్వహించినప్పుడు శాశ్వత భవనం లేకపోవడం లోటుగా ఉందని గ్రహించిన అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు భవన నిర్మాణానికి స్థలాన్ని ప్రకటించారు. ప్రతి సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు ముఖ్యంగా పల్స్ పోలియోకు సంబంధించి దాతల ద్వారా విరాళాలను సేకరించి తద్వారా పోలియో నిర్మూలనకు తోడ్పాటు అందిస్తున్నారు. ఈ క్రమంలో శాశ్వత భవనం ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి అవకాశం కలుగు తుంది అనే ఉద్దేశంతో సుమారు 70 లక్షల రూపాయలు విలువ గల 300 గజాల స్థలాన్ని విరాళంగా ప్రకటించారు. రాజేంద్రనగర్ శివారు ఎఫ్ త్రీ హోటల్ సమీపంలో ఉన్న స్థలంలో తక్కువ సమయంలో భవన నిర్మాణం జరపాలని అడుసుమిల్లి సభికులను కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 30 మందికి పైగా రోటరీ సభ్యులు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యలమ ంచిలి నాగేశ్వరరావు, గుళ్లపల్లి కిరణ్ బాబు లు కౌన్సిలర్స్ గవర్ననేని బాబు శ్రీకర్, డా॥ పొట్లూరి విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ముళ్ళపూడి రమణమూర్తి, పూర్వ అధ్యక్షులు బలుసు శంకరరావు, యలమంచిలి రెడ్డియ్య చౌదరి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, టి.ఎన్. రాజశేఖర్, రావి శ్రీహర్ష, కొల్లి శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, ఎం చిన్నకుమారి, ఎన్ మాధవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 2029లోనూ కూటమిదే అధికారం పళ్ళెం ఏడుకొండలు



**కైకలూరు, జూన్ 13 (వార్తాప్రభ) :** వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు, దళితులకు, రైతులకు, నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచారని ఏలూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు పళ్ళెం ఏడుకొండలు విమర్శించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జగన్ పాలనలో రాష్ట్రం వెనుకబడిందని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అందుకే ప్రజలు వైసీపీని తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, దళిత సంక్షేమం, నిరుద్యోగ యువత అంశాల్లో జగన్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుందని, 2029లో కూడా కూటమిదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు.

# అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడక ప్రసాద్‌ని అభినందించిన జిల్లా కలెక్టర్ బాలాజీ..



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** శనివారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో 14/06/2026 ప్రపంచ రక్తదాన దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడక ప్రసాద్ ని 39 సార్లు రక్తదానం చేసినందుకు, అలాగే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ డి.కే. బాలాజీ, మడక ప్రసాద్ సేవలను ప్రశంసిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా॥ ఆర్.కె. ప్రసాద్, కృష్ణా జిల్లా సెక్రెటరీ ఎం శంకర్ నాథ్, కోశాధికారి సుకుమార్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి, యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా 39 సార్లు రక్తదానం చేసి సమాజ సేవలో ఆదర్శంగానిలిచిన శ్రీ మడక ప్రసాద్ గారిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# వేల్పూరు దాసు మాస్టర్ ధన్యజీవి

- గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



**పెనుగంచిప్రోలు,జూన్ 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామ విశ్రాంత ఉపాధ్యాయులు వేల్పుల దాసు మాస్టర్ తను 94 సంవత్సరాల వయసులో మరణించటం ఆయన ధన్యజీవిగా నేను అభిప్రాయ పడుతున్నానని గన్నవరం జెడ్పిటిసి, వై ఎస్ ఆర్ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నవరపు ఎలిజ బేత్ రాణి అన్నారు, శనివారం పెనుగంచిప్రోలు లోని ఆయన పెద్ద కుమారుడు, మాజీ సీడ్ క్యాప్ రాష్ట్ర చైర్మన్ వేల్పుల రవి కుమార్, మాజీ జెడ్పీటీసీ సర్పంచ్ పద్మ,కుమారి ఇంటిలోని దాసు మాస్టర్ పోటో ముందు పూలు వేసి నివాళులు అర్పిస్తూ,వారు ఈ మాట అన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ దాసు మాస్టర్ ఉపాధ్యాయ వృత్తి ద్వారా సమాజానికి ఎంతో సేవ చేశారనీ,అలాగే వారి కుటుంబ సభ్యులను ప్రజలకు చేవ చేయటానికి ప్రోచ్చాహించారన్నారు.మాస్టారు ప్రధానంగా ఒక దళిత కుటుంబంలో పుట్టి డాక్టర్ బిఆర్ అంబేత్కర్ ఆలోచనను అంది పుచ్చుకొని, సమాజానికి ఎంతో ఉపయోగ పడ్డారని అందుకే ఆయన ధన్య జీవితం గడిపారన్నారు. దాసు మాస్టర్ కి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిబిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, ఐఐటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అన్నవరపు చంద్రశేకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే చంటి

- వినతుల స్వీకరణ - ప్రజలతో ముఖాముఖి
- అధికారులకు తక్షణ ఆదేశాలు





**ఏలూరు, జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా విన్నారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే చంటి, సమస్యల పూర్తి వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మేలు చేకూరేలా సంక్షేమ కార్యక్రమాలను విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు.


# త్రిబుల్ ఐటీ ప్రవేశ పరీక్షలో బంటుమిల్లి మండల విద్యార్థినుల ప్రతిభ....



**కృత్తివెన్ను,జూన్ 13 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించి త్రిబుల్ ఐటీ అర్హత పరీక్షలో విజయం సాధించిన మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినిలు.


# డబల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ

- పట్టణ అభివృద్ధికి మంత్రి కొలుసు పార్ధసారధి కృషి
- నూజివీడు పట్టణ బిజెపి కార్యవర్గ సమావేశం



**నూజివీడు,జూన్ 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో సర్వతోముఖాభి వృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ బిజెపి పార్టీ కార్యనిర్వాహకులు మల్లెపూడి రాజశేఖర్ పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు.శనివారం నూజివీడులో జరిగిన బిజెపి పట్టణ కార్యవర్గ సమావేశానికి అయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేత్రుత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా సుపరిపాలన అందిస్తూ ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నా యన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం, వైజాగ్ లో పారి శ్రామికాభివృద్ధి, మహిళల స్వయంసమృద్ధి,బడుగు బలహీన వర్గాలకు గృహ నిర్మాణం,యువతకు ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయానికి చేయూత, పోర్ధుల నిర్మాణం, జాతీయ, గ్రామీణ రహదారుల నిర్మాణం, విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు వంటి బృహత్తర కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల పాలన పూర్తిచేసుకుందని రాజశేఖర్ అన్నారు.అన్ని రంగాలలో నూజివీడు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్ధసారధి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.నియోజకవర్గ కూటమి సమన్వయకర్త, సర్ కార్యక్రమ ఇంచార్జ్ మాటూరి రవికాంత్ మాట్లాడుతు 15 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల సవరణ కార్యక్రమంలో ఎంపిక చేసిన బిఎల్ ఓ 2 లు తమ తమ పోలింగ్ బూత్ పరిధిలో జరిగే ఇంటింటి సర్వే కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

# నేడే..కమ్యూని స్టు పార్టీ ( సీపీఐ ) ర్యాలీ... జయప్రదం చేయండి.. దోనే పూడి శంకర్.......



**పెనుగంచిప్రోలు,జూన్ 13 (వార్తాప్రభ) :** రాష్ట్ర కమ్యూనిస్ట్ పార్టీ ( సీపీఐ ) రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు పెనుగంచిప్రోలు స్నేహా గార్డెన్ జరుగు తున్న సందర్భంగా ఆదివారం పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద నుండి కాజ్ వే మీదుగా స్నేహా గార్డెన్ వరకు గొప్ప ర్యాలీ జరుగనుందని ఎన్ టీ ఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దో నే పూండి శంకర్ తెలిపారు, ఈ ర్యాలీ లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా, తెలంగాణ రాష్ట్ర సీపీఐ ప్రధాన కార్యదర్శి కొత్త గుడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివ రావు, తదితరులు పాల్గొ నను న్నారు,కావున వామాపక్ష వాదులు ప్రజలు ఈ ర్యాలీ లో పాల్గొని జయప్రదం చేయగలని శంకర్ కోరారు.

